## క్లుప్తంగా

### 14న చైతన్య యాత్ర

**కడప రూరల్ :** బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 14న జిల్లాలో కొనసాగే బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సగిలి గుర్రప్ప, కన్వీనర్ డీఎస్ జయరాం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కోశాధికారి శనివారపు రాజగోపాల్, నాగార్జున, ఆనంద్, వినోద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో 2023 ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ యూనియన్ నాయకులు కెసీ బాదుల్లా, మద్దిలేటి, సుబ్బరాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సీమకు అన్యాయం చేస్తే సహించేది లేదు

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం చేపడితే రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక తనకు కేటాయించిన నీటి వాటా కంటే ఎక్కువగా వాడుకుంటూ అల్మట్టి డ్యాం ఎత్తు పెంచే ప్రయత్నాలు చేస్తోందన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి అధిక నిధులు కేటాయించడం చూస్తే ఇది ఎన్నికల ఎత్తు గడలో భాగమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సురేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### 'వికాస తరంగిణి'కి విశేష ఆదరణ

**కడప కల్చరల్ :** విశ్వహిందూ పరిషత్ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు బెస్తవేముల రామమహేష్, దాసరి విజయ, ఉపాధ్యక్షులు గూడూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండులోని వీహెచ్‌పీ కార్యాలయంలో నిర్వహించిన వికాస తరంగిణి కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామి సూచనల మేరకు 6 నెలల శిశువు నుంచి 16 ఏళ్ల బాలల వరకు స్వర్ణామృత ప్రాసనం అందజేశారు.

### 6న చలో కలెక్టరేట్

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** అంగన్వాడీల సమస్యలపై ఈ నెల 6న నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలను పెంచి ప్రభుత్వమే గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. దీంతో పాటు ఆయా సమస్యలపై నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్‌ను అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

### టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి

**కడప వైఎస్‌ఆర్ సర్కిల్ :** టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టిడ్కో ఇళ్లను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలమారెడ్డిపల్లి వద్ద 1440 టిడ్కో ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి వారికి అందించాలన్నారు. బ్రహ్మం, బాబు, మల్లిఖార్జున. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రికార్డుల తనిఖీ

**కడప అర్బన్ :** పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను ఓపికతో విని పరిష్కరించాలని కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి తెలియజేశారు. శనివారం కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ లాంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కేసులకు సంబంధించిన రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. సీఐ ఉలసయ్య, ఎస్ఐ తాహిర్‌హుసేన్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

### కేంద్ర బడ్జెట్‌పై వెబినార్

**వైవీయూ :** మూలధన వ్యయం పెరుగుదలకు దారితీసే మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఆర్థికవృద్ధిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం బలమైన నిబద్ధతను ఈ బడ్జెట్ ద్వారా చాటిచెప్పిందని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం అర్థికశాఖ జె.బి. కొమరయ్య విశ్లేషించారు. వైవీయూ అర్థికశాఖ విభాగాధిపతి ఆచార్య ఎం. అనిత ఆధ్వర్యంలో 'యూనియన్ బడ్జెట్ -2023-23: సెక్టోరల్ అనాలసిస్' అన్న అంశంపై వర్చువల్ విధానంలో వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడుతూ బడ్జెట్‌కు గురించి సుదీర్ఘంగా వివరించారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, అర్థికశాఖ ఆచార్యులు బాయినేని శ్రీనివాస్, అర్థికశాఖ అధ్యాపకులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

**ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు**



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో మేయర్ సురేష్‌బాబు

**కడప కార్పొరేషన్ :** కడప నగరాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్ కూడలి నుంచి వై జంక్షన్ వరకూ రహదారి విస్తరణకు అంగీకరించి టీడీఆర్ బాండ్లు తీసుకున్న బిల్డింగ్ యజమానులకు సర్టిఫికెట్లను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఏ నగరం అభివృద్ధి చెందాలన్నా రహదారుల విస్తరణ తప్పనిసరన్నారు. ఇటీవలి కాలంలో కడపలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, దాదాపు ప్రతి ఇంటికి ఒక కారు, రెండు, మూడు ద్విచక్ర వాహనాలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో నగరంలోని 16 రోడ్లను విస్తరించాలని తాము ప్రతిపాదించగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏడు రోడ్లకు అనుమతి మంజూరు చేశారు. ఇందులో ఎర్రముక్కపల్లె నుంచి రైల్వే స్టేషన్, మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్ వరకూ ఉన్న రోడ్లను ఇదివరకే విస్తరించామన్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ సర్కిల్- వై జంక్షన్, మాసాపేట- బైపాస్ రోడ్డు, అన్నమయ్య విగ్రహం- గోకుల్ లాడ్జి, క్రిష్ణా సర్కిల్- దేవునికడప రోడ్లను విస్తరించాల్సి ఉందన్నారు. రోడ్ల విస్తరణ చేయాలంటే భూసేకరణ చేయాల్సి ఉంటుందని, దీనివల్ల ప్రభుత్వంపై ఎక్కువ భారం పడుతుందన్నారు. కాగా ఆరు నెలలుగా అందరినీ ఒప్పించి, మెప్పించి టీడీఆర్ బాండ్లు తీసుకునేలా చేసిన కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులను వారు అభినందించారు. ప్రజల సహకారం లేనిదే రోడ్ల విస్తరణ సాధ్యం కాదన్నారు. కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ రహదారుల విస్తరణలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులు కీలకపాత్ర పోషించారని, డీసీపీ ఏసీపీలు నష్టపోతున్నవారికి అవగాహన కల్పించి ఒప్పించారన్నారు. ఆర్‌డీఓ, తహసీల్దార్, వార్డు ప్లానింగ్ సెక్రటరీల కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, బి.నిత్యానందరెడ్డి, డీసీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జమాల్‌వలీ, కమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**జేసీబీ, స్వీపర్ మెషీన్లతో పారిశుధ్యం మెరుగు**

కడప నగరపాలక సంస్థ నూతనంగా కొనుగోలు చేసిన జేసీబీ, రోడ్ వ్యాక్యూమ్ స్వీపర్ మెషీన్లను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు ప్రారంభించారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ వాహనాల వద్ద టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, మేయర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.36 లక్షలతో జేసీబీ, రూ.58లక్షలతో రోడ్ వ్యాక్యూమ్ స్వీపర్ మెషీన్‌లను కొనుగోలు చేశామన్నారు. వీటి ద్వారా నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థకు ఇదివరకే మూడు జేసీబీలు ఉన్నాయని, వీటి సాయంతో నాలుగు జోన్లలో పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, బి. నిత్యానందరెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, కార్పొరేటర్లు షఫీ, బాలస్వామిరెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, కో ఆప్షన్‌సభ్యులు హరూన్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, డీఈ అబిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసమే విజయానికి పునాది

**సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

**కడప ఎడ్యుకేషన్ :** పదో తరగతి విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, మనోధైర్యం విజయానికి పునాదిలాంటివని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి పది పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. పరీక్షలంటే భయాన్ని వీడి ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతో పరీక్షలను రాస్తే విజయం మీ సొంతం అవుతుందన్నారు. నిజ జీవితంలో విద్యార్థులు రాణించాలంటే మార్కులే ప్రమాణికం కాదని ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఉపాధ్యాయులు దామోధర్, లలిత, శ్రీధర్‌రావు, సీఆర్‌పీ కృష్ణ , విద్యార్థులు పాల్గొన్నారు.

### 1వ తేదీన వేతనాలు చెల్లించాలి

**కడప ఎడ్యుకేషన్ :** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు, వేతనాలు, పెన్షన్లు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కడప జెడ్పీ ఆవరణలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వేతనాలు ఎప్పుడు పడతాయో ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అలాగే పాఠశాలల తనిఖీల పేరుతో చిన్న, చిన్న కారణాలకు ఉపాధ్యాయులకు మెమోలు ఇవ్వడం, సస్పెన్షన్లు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఖాదర్‌బాష, గురయ్య, శ్రీనివాసులరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రామచంద్రారెడ్డి, రమణ రమణారెడ్డి పాల్గొన్నారు.

# అవన్నీ అసత్యాలు, ఆరోపణలే

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్**



**కడప కార్పొరేషన్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కేసులో టీడీపీతో పాటు కొన్ని పత్రికలు కావాలనే విష ప్రచారం చేస్తున్నాయని.. అవన్నీ అసత్యాలు, ఆరోపణలేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. ఈ కేసులో సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని తాము ముందు నుంచి కోరుతున్న విషయాన్ని గుర్తు చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే వైఎస్ వివేకా హత్య జరిగిందని, అప్పుడు వారు ఎందుకు నిజానిజాలు నిగ్గు తేల్చలేకపోయారని ప్రశ్నించారు. వైఎస్ కుటుంబ సభ్యులపైనే ఆ హత్యానేరాన్ని మోపాలని తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ కేసులో విచారించాల్సిన వారిని విచారించకుండా సీబీఐ వైఎస్ కుటుంబాన్నే టార్గెట్ చేయడం సరికాదని మండిపడ్డారు. సీబీఐకి భయపడినట్లుగా టీడీపీ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో స్టేలు తెచ్చుకొని, రాష్ట్రంలోకి సీబీఐ అడుగుపెట్టకుండా చేసింది ఎవరో గుర్తు చేసుకోవాలన్నారు. ఒకరిపై నింద వేసేముందు వారి కుటుంబ సభ్యులు ఎంత క్షోభ అనుభవిస్తారో ఆలోచించాలని జిల్లా టీడీపీ నేతలకు హితవు పలికారు.

### అవినాష్‌రెడ్డిపై నిందలు సరికాదు



మాట్లాడుతున్న నిత్య, పులి సునీల్ తదితరులు

**కడప కార్పొరేషన్ :** కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిలు అవాకులు, చెవాకులు మాట్లాడటం సరికాదని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరో సీబీఐ తేల్చుతుందన్నారు. బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డిలు తామే సీబీఐ ఆఫీసర్లలాగా ఊహించుకొని మాట్లాడడం సరికాదన్నారు. బీటెక్ రవి, ఆదినారాయణరెడ్డిల చరిత్ర ఏమిటో జిల్లా ప్రజలకు బాగా తెలుసన్నారు. కార్పొరేటర్లు షఫీ, చెన్నయ్య, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

# క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న 'సన్‌రైజ్' వైద్యులు, సిబ్బంది



ర్యాలీ నిర్వహిస్తున్న ఫిమ్స్ వైద్యులు

**కడప సెవెన్‌రోడ్స్ :** దేశంలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి జీవితకాలంలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని ఫాతిమా వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఫిమ్స్ పట్టణ ఆరోగ్య శిక్షణా కేంద్రం, జాతీయ సేవాదళం ఆధ్వర్యంలో అక్కాయపల్లెలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశానంతరం అక్కాయపల్లెలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బెనజీర్ పాల్గొన్నారు.

**కడప కల్చరల్ :** క్యాన్సర్ వ్యాధి గురించి అపోహలు, భయాలు వీడాలని, అవగాహనతో ఎదుర్కొవాలని ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ప్రమోద తెలిపారు. శనివారం వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ పట్ల అవగాహన తరగతులు నిర్వహించారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్‌రాహుల్ పాల్గొన్నారు.

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సన్‌రైజ్ మల్టీ, సూపర్ స్పెషాలిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి, వైద్య నిపుణులు శంకర్‌రెడ్డి తెలిపారు.సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య నిపుణులు రమ్యతారెడ్డి, వంశీధర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

### వైవీయూ పరిశోధకుడికి నిధులు

**వైవీయూ :** యోగివేమన విశ్వవిద్యాలయం జంతుశాస్త్రశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎస్. వెంకటరామిరెడ్డికి హైదరాబాద్ విర్చ బయోటెక్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ. 2 లక్షల నిధులను విడుదల చేసింది. జంతుశాస్త్రశాఖలో ఊపిరితిత్తుల వ్యాధులపై చేస్తున్న పరిశోధన కొనసాగింపునకు ఈ నిధులను వినియోగించాలని సూచించారు. గతంలో విర్చ బయోటెక్ ఐదేళ్లపాటు పరిశోధకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.

### రహదారి భద్రతపై అవగాహన ఉండాలి

**కడప ఎడ్యుకేషన్ :** విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రమణ్యం పేర్కొన్నారు. శనివారం కడపలోని శివశివాని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కరస్పాండెంట్ రమణి, పాఠశాల డైరెక్టర్ నాగేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కెరియర్‌పై అవగాహన పెంచుకోవాలి

**స్టెప్ సీఈఓ సాయిగ్రేస్**



మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర రీసోర్సుపర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు

**కడప ఎడ్యుకేషన్ :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు చదువుతోపాటు కెరియర్ పైన కూడా అవగాహన పెంచుకోవాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో ఏకలవ్య ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు అనుకున్న లక్ష్యాలని సాధించడానికి ప్రణాళిక బద్ధంగా చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంపాక్ట్ ట్రైనర్ కుమారి సంధ్య, విద్యాశాఖ రాష్ట్ర రీసోర్సుపర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడారు. విద్యార్థులతోపాటు హెచ్ఎం బాగ్యవతి, ఏకలవ్య ఫౌండేషన్ జిల్లా విద్య కో-ఆర్డినేటర్ నరేస్, మీకోసం సమితి అధ్యక్షులు విష్ణువర్థన్ తదితరులు పాల్గొన్నారు.

# తలసీమియా పిల్లలను కాపాడుకోవాలి

**చిన్నపిల్లల డాక్టర్ రమణ దండమూడి**

**కడప అర్బన్ :** జిల్లాలో తలసీమియా, హీమోఫీలియా పిల్లలను ఆరోగ్యంగా కాపాడుకోవాలని చిన్నపిల్లల హెమటాలజీ డాక్టర్ రమణ దండమూడి తెలియజేశారు. రిమ్స్ ఆవరణలోని జిల్లా బాలభవిత కేంద్రం ఆధ్వర్యంలో తలసీమియా, హీమోఫీలియా వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని 102 మంది తలసేమియా పిల్లలుండగా ఈ వైద్య శిబిరానికి 83 మంది హాజరై వైద్య పరీక్షలను చేయించుకున్నారు. తలసేమియా సొసైటీ అధ్యక్షుడు కె. రవికుమార్, హీమోఫీలియా కడప చాప్టర్ సెక్రటరీ దుర్గాప్రసాద్, డిఈఐసీ- డీసీ డాక్టర్ వెంకట చంద్రారెడ్డి, డీఈఐసీ చిన్నపిల్లల డాక్టర్ విష్ణువందన, హైదరాబాద్ డాక్టర్లు మహేష్, గాయత్రి, సుస్మిత, సృజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ జయలక్ష్మి, రాణి ఉన్నారు. ఈ కార్యక్రమంలో 2023 తలసీమియా, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ క్యాలెండర్ విడుదల చేశారు.

### మెడికేర్ ఆసుపత్రిలో నేడు వైద్య శిబిరం

**కడప ఎడ్యుకేషన్ :** కడపలోని మెడికేర్ ఆసుపత్రిలో హైదరాబాదు ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5వ తేదీ ఆదివారం వాస్క్యులర్ చికిత్స వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద పెద్ద నగరాలకే పరిమితం అయిన వాస్క్యులర్ సేవలు నేడు కడపలో ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఎవరికైన కాళ్లలో నరాలు ఉబ్బి, మెలికలు తిరిగిన, శాలి పురులాంటి నరాలు, కాలు లేదా పాదం వాపు, సిరపుండ్లు, కళ్లలో రక్త సరఫరా లేకపోవడం లాంటి సమస్యలతో బాధపడుతూ ఉంటే వారు ఈ వైద్య శిబిరానికి హాజరై పరీక్షలను చేయించుకోవాలని తెలిపారు. డాక్టర్ కన్సల్టేషన్‌తోపాటు రూ. 4500 విలువ చేసే వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తామన్నారు. నగర ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ తెలిపారు.

# సకల దేవతలకు ఆహ్వానం

**వైభవంగా శ్రీ విజయదుర్గమ్మ ధ్వజారోహణం**



అమ్మవారికి చందనాభిషేకం

**కడప కల్చరల్ :** కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌రావు ఈ సందర్భంగా తొలి పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలకు సర్వదేవతలను ఆహ్వానిస్తూ సింహ పతాకాన్ని ధ్వజంపై ఎగురవేశారు. అర్చక బృందం వేదమంత్రయుక్తంగా పూజలు నిర్వహించింది. యాగ మండపానికి ఊరేగింపుగా మంత్రోచ్చాటనల మధ్య వెళ్లి చండీహోమం, గణపతిహోమం, మహామృత్యుంజయ హోమాలను నిర్వహించారు. శ్రీ చక్ర మండపంలో ప్రత్యేకంగా నవావరణ శ్రీ చక్రార్చన నిర్వహించారు. రాత్రి శ్రీ విజయదుర్గ, మల్లికార్జునులను భక్తులు సింహ వాహనంపై కొలువుదీర్చి ఆలయ ప్రదక్షిణ చేయించారు. ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా విశేష అభిషేకాలు, హోమాలు నిర్వహిస్తామని కార్యక్రమ నిర్వాహకులైన వేద పండితులు రాయపెద్ది సుబ్బరామ శర్మ తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు



వాహనాల తనిఖీ చేస్తున్న కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం

**కడప అర్బన్ :** జిల్లావ్యాప్తంగా పోలీసులు రహదారులపై వాహనాల తనిఖీ ముమ్మరంగా నిర్వహించారు. మద్యం, గుట్కా, తదితరాలు అక్రమ రవాణా జరగకుండా శనివారం రాత్రి 9 నుంచి వాహనాల తనిఖీలు తెల్లవారుజామున 2 గంటల వరకు కొనసాగాయి. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో కార్లు, జీపులు, లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలను తనిఖీ చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డీఎస్పీ లు సైతం పాల్గొని ప్రతీ వాహనాన్ని చెక్ చేశారు.

# ఎల్‌ఐసీ పాలసీదారుల సొమ్ముకు పూర్తి భద్రత

**కడప కల్చరల్ :** అదాని గ్రూపు సంస్థలపై అమెరికాకు చెందిన హిండన్ బర్గ్ చేస్తున్న విమర్శల కారణంగా అదాని సంస్థల్లో ఎల్‌ఐసీకి భారీగా పెట్టుబడులు ఉన్నాయని, మధ్యతరగతి పొదుపు మొత్తాలకు దీనివల్ల ముప్పు ఉందన్న అపోహతో చాలా మంది వ్యక్తులు, రాజకీయ పార్టీల నుంచి ఆందోళన వ్యక్తమవుతోందని, ఇందులో నిజం లేదని ఎన్ఎఫ్ఐ, ఎఫ్‌డబ్ల్యూఐ కడప డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.యల్లారెడ్డి, జె.చంద్రపాల్ తెలిపారు.ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రజలు ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగే రీతిలో దేశంలోని ఏ పారిశ్రామిక గ్రూపునకు రాజకీయ దన్ను అందినా, దాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఇండెన్ బర్గ్ నివేదికలోని నిజాన్ని బయట పెట్టేందుకు ప్రభుత్వం నిష్పాక్షిక విచారణకు ఆదేశించాలని వారు కోరారు. ఎల్‌ఐసీ దీర్ఘకాలిక ఇన్వెస్టర్ అని, పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పాటైన సంస్థ అని, అది తన పెట్టుబడులపై తీసుకునే అన్ని నిర్ణయాలు పార్లమెంటు పరిశీలనకు, నియంత్రణ సంస్థల పర్యవేక్షణకు లోబడే ఉంటాయని స్పష్టం చేశారు. అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో కాంగ్రెస్ పార్టీ ఫిబ్రవరి 6న దేశ వ్యాప్తంగా అన్ని ఎల్‌ఐసీ కార్యాలయాల ఎదుట నిరసనప్రదర్శనలు నిర్వహించేందుకు సిద్ధమవుతోందని, అది మంచి పద్ధతి కాదని వారు సూచించారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఎల్‌ఐసీ లాంటి గొప్ప సంస్థ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శించడం దాని ప్రతిష్టను దెబ్బతీస్తుందని భావిస్తున్నామని, ఈ విషయంగా పునరాలోచించాలని వారు కోరారు.

# ఇది పేదల సంక్షేమం కోరే ప్రభుత్వం

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- 41వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

**కడప కార్పొరేషన్ :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని కోరేదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 41వ డివిజన్ పరిధిలోని రవీంద్రనగర్‌లోని తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల వారికి కలుగుతున్న లబ్ధిని తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా పథకాలు అర్హులకు అందడం లేదా.. అని ఆరా తీశారు. ప్రజల సంక్షేమం గూర్చి ఆలోచించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. 41వ డివిజన్ ఇన్‌చార్జి జమాల్‌వలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, మియ్యా, సుబ్బారెడ్డి, మున్నా, తోట క్రిష్ణ, డా. సొహైల్, లక్ష్మినారాయణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులతో పాఠశాల డైరెక్టర్ తదితరులు

**కడప స్పోర్ట్స్:** క్రీడల్లో జయాపజయాలను సమానంగా స్వీకరించాలని కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి పేర్కొన్నారు. కడప నగరం చిన్నచౌకులోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో క్రీడావార్షికోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు చక్కటి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త రాజేష్ జువ్వ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో డీన్ శివకుమార్, పీఈటీ జయచంద్ర, లక్ష్మయ్య, నాగర్జున, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కర్నూలులో ఆదివారం జరిగే ఏపీ జేఏసీ అమరావతి మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.సుమన్ పిలుపునిచ్చారు. కర్నూలు మహాసభ నేపథ్యంలో శనివారం కడపలో నిర్వహించిన జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో సుమన్ మాట్లాడుతూ కర్నూలు సభకు ప్రతి ఒక్కరూ తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ దివాకర్‌బాబు, పట్టణ పేదరిక నిర్మూలన ప్రాజెక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులయ్య, కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్‌శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.